
సాక్షి పల్నాడు

శనివారం । 26 । ఆగస్టు । 2023



అమ్మవారికి పూజలు

పిడుగురాళ్లరూరల్: జూలకల్లులోని శ్రీ నిదానం పాటి లక్ష్మీ అమ్మ ఆలయం మహిళా భక్తులతో శుక్రవారం పోటెత్తింది. అమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు జరిగాయి.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2080 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

జీజీహెచ్ సమస్యలపై స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి

గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శుక్రవారం కలిసి జీజీహెచ్ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కాకుమానువారితోటలో ఆసుపత్రికి కేటాయించిన ఆరు ఎకరాల స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రహరీ గోడ నిర్మించాలని, సీటీ స్కాన్ పరికరం మరమ్మతులకు నిధులు కేటాయించాలని, నాలుగో తరగతి ఉద్యోగుల నియామకాలకు అనుమతులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఆసుపత్రిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కృష్ణబాబు హామీ ఇచ్చారని కిరణ్‌కుమార్ తెలిపారు. సూపరింటెండెంట్‌తోపాటు జింఖానా కార్యదర్శి డాక్టర్ పాదిల ప్రసాద్ కూడా స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసి ఆసుపత్రి అభివృద్ధి గురించి చర్చించారు.

108 అంబులెన్సులో డ్రైవర్ ఉద్యోగాలు

గుంటూరు మెడికల్: 108 అంబులెన్సులో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ శుక్రవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి 35 సంవత్సరాల్లోపు ఉన్నవారు ఉద్యోగాలకు అర్హులన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ. 18 వేలు వేతనం చెల్లిస్తారన్నారు. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు శనివారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో నేరుగా వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9154771192 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గుంటూరు జీజీహెచ్‌లో ..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ సర్జన్, న్యూరో సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎనస్థిటిస్ట్, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సెప్టెంబరు 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను పోస్టులో గానీ, నేరుగా గానీ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యార్హతలు, దరఖాస్తు, ఇతర వివరాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ చూడాలన్నారు.

జిల్లాస్థాయి టీచర్ పురస్కార ప్రతిపాదనలు పంపండి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో అర్హులైన వారిని ఈ నెల 29 లోపు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లను డీవైఈవోలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలను ఎంఈవోలు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన వారిని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎంపిక చేసి, ఆయా కమిటీల ద్వారా ఈనెల 29వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు డీఈవో కార్యాలయానికి పంపాలని సూచించారు. గడువు ముగిసిన తరువాత దరఖాస్తులను స్వీకరించబడవని తెలిపారు.

26,738 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,451 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,738 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,295 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.మూడు వేలు, గరిష్ట ధర రూ.ఐదు వేలు, మోడల్ ధర రూ.నాలుగు వేలు వరకు పలికింది.

దేదీప్యమానం

- జగనన్న కాలనీల్లో విద్యుత్ కాంతులు
- రూ.196.55 కోట్లతో విద్యుదీకరణ
- ఉమ్మడి జిల్లాలో తొలిదశగా 586 లేఅవుట్లలో పనులు
- లబ్ధిదారుల ఇళ్లకూ ఉచితంగానే మీటర్లు
- అవసరమైన చోట్ల సబ్‌స్టేషన్లు



శ్రీరస్తు.. 'శోభ'మస్తు : సత్తెనపల్లి మండలం గాండ్లూరు జగనన్న కాలనీలో విద్యుద్దీప వెలుగులు

యడ్లపాడు: జగనన్న ప్రభుత్వం వచ్చాక పేదల కళ్లల్లో సంతోషాల కాంతులు విరుస్తున్నాయి. నవరత్నాలు-అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు పంపిణీ చేసి గృహాల నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం తాజాగా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రోడ్లు, నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తోంది. తొలిదశలో ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు సీఆర్డీఏ పరిధిలోని 586 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులను దాదాపు పూర్తి చేసింది. ఫలితంగా జగనన్న కాలనీలు దేదీప్యమానమై మెరుస్తున్నాయి. సరికొత్త శోభను సంతరించుకుంటున్నాయి.

ఇళ్ల నిర్మాణాలకు ఇతోధిక సాయం

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల కోసం లబ్ధిదారులకు సర్కారు ఇతోధిక సాయం అందిస్తోంది. తక్కువ ధరకే నాణ్యమైన సామగ్రి, ఉచితంగా ఇసుక, నిర్మాణానికి రుణసాయం చేస్తోంది. ఫలితంగా గృహనిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. దీంతో సదుపాయాల కల్పనపైనా సర్కారు దృష్టిపెట్టింది.

విద్యుదీకరణ ఇలా...


ఉమ్మడి గుంటూరు జిల్లా, సీఆర్డీఏ పరిధిలోని 586 లేఅవుట్లలో తొలిదశగా విద్యుదీకరణ పనులను ప్రభుత్వం గతేడాది జూలై చివరిలో ప్రారంభించింది. ఈ లేఅవుట్లలో మొత్తం 79,585 ప్లాట్లు ఉన్నాయి. ప్రస్తుతం విద్యుదీకరణ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. 16, 63, 100 కేవీ సామర్థ్యం కలిగిన 1,537 ట్రాన్స్‌ఫార్మర్లను కాలనీల్లో అమర్చింది. 33,547 స్తంభాలు ఏర్పాటు చేసింది. మూడు అతిపెద్ద లేఅవుట్లలో సబ్‌స్టేషన్లూ నిర్మిస్తోంది. ఓ లేఅవుట్‌లో ఫీడర్ నిర్మించింది. స్తంభాలను ఎల్‌టీ, హెచ్‌టీలైన్లకు అనుసంధానం చేసింది.

ప్రతిఇంటికీ మీటర్ ఉచితం

జనన్న కాలనీల్లో నిర్మించే ప్రతి ఇంటికీ ఒక కిలోవాట్ సామర్థ్యంతో విద్యుత్ సర్వీసుని మంజూరు చేస్తున్నారు. మీటర్ బోర్డు, సర్వీసు వైరు, ఎంసీబీ స్విచ్, ఒక బల్బు, పోల్‌నుంచి ఇంటివరకు ఎర్త్‌వైరుతో ఉచితంగా కనెక్షన్ ఇస్తారు. ఈ మొత్తానికి సాధారణంగా రూ.5 వేల నుంచి రూ.ఆరు వేల వరకు ఖర్చవుతోంది. అయితే ప్రభుత్వమే ఈ భారాన్ని భరిస్తోంది.

విద్యుదీకరణ పనులకు నిధులు ఇలా ..

ప్రాంతం	కేటాయించింది (రూ.కోట్లలో)
ఉమ్మడి గుంటూరు జిల్లా	77.41
సీఆర్డీఏ పరిధిలో..	102.88
సబ్‌స్టేషన్ల నిర్మాణానికి	16.26
మొత్తం	196.55



'లైన్'క్లియర్: తెనాలి మండలం బుర్రిపాలెంలో కొత్త ఎల్‌టీ, హెచ్‌టీ లైన్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జగనన్నకు రుణపడి ఉంటాం...



ప్రభుత్వ సాయంతో జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాం. విద్యుత్ అధికారులు ఉచితంగా మీటర్ బిగించి కనెక్షన్ ఇచ్చారు. నిలువ నీడలేని మాకు ఇంటిని సమకూర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బసెల మాధవీ, చెంఘీజ్‌ఖాన్‌పేట

నిలువనీడ, వెలుగునిచ్చారు



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాకు నిలువ నీడ కల్పించారు. వెలుగునూ ఇస్తున్నారు. మా కాలనీలో అన్ని వసతులూ సమకూర్చారు. వీధి లైట్లు ఏర్పాటు చేశారు. ధన్యవాదాలు.

– పాలతోటి సువర్ణ, అనిల్ దంపతులు, పసుమర్రు లేఅవుట్ నివాసితులు

నేటి నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు రేంజ్ ఐజీ



పరుగు పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ పాలరాజు, గుంటూరు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం ఉదయం ఐదు గంటల నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎస్ఎల్‌పీఆర్‌బీ) నిర్వహించిన ఎస్ఐ ప్రాథమిక రాత పరీక్షల్లో గుంటూరు రేంజ్ పరిధిలో 12,957 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. శనివారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న దృష్ట్యా శుక్రవారం గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. బరువు, ఎత్తు, ఛాతీ కొలిచే పరికరాలు, లాంగ్ జంప్ నిర్వహించే ప్రదేశాన్ని, పరుగుపందెం జరిగే మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ పక్బందీగా పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దని, ప్రతిభే కొలమానంగా పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఐజీ వెంట ఏఎస్పీలు కె.కోటేశ్వరరావు (ఏఆర్), అశోక్‌బాబు (ఒంగోలు), ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ) బాలసుందరరావు (ట్రాఫిక్), శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), చంద్రశేఖర్ (ఏఆర్), ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ సీఐ బాలసుబ్రమణ్యం, నగరంపాలెం పీఎస్ సీఐ హైమరావు, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఐజీ కార్యాలయపు సిబ్బంది, డీపీఓ మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు.

లేటెస్ట్ సేవలు

- ఏరియా వైద్యశాలలో అధునాతన యంత్రం
- రూ.25 లక్షలతో 'ఫుల్లీ ఆటోమేటిక్ ఎన్‌లైజర్ ఎక్సెల్-640' ఏర్పాటు
- 640 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి..
- వేగం.. కచ్చితత్వమే లక్ష్యం



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్సెల్ -650 మిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు(ఫైల్)

సత్తెనపల్లి: ఖరీదైన కార్పొరేట్ వైద్యం చేయించుకోలేకపోతున్న పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నాడు-నేడుతో వైద్యశాలల రూపురేఖలు మార్చడంతోపాటు సకల వసతులు సమకూర్చారు. అధునాతన యంత్రాలనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. దీనిలో భాగంగా తాజాగా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రూ. 25 లక్షలు వెచ్చించి 'ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్సెల్-650' యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం ద్వారా 640 రకాల వైద్య పరీక్షలు చేయవచ్చు.

గతంలో ప్రైవేట్ ల్యాబ్‌ల్లోనే ..

టీడీపీ పాలనలో ప్రభుత్వ వైద్యశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండేది. పరీక్షల బాధ్యత మెడాల్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో ఫలితాలు సరైన సమయానికి వచ్చేవి కావు. దీంతో రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడేవారు. వేగంగా పరీక్షా ఫలితాలు రావడం కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. దీనివల్ల వేల రూపాయల భారం పడేది. హృద్రోగ పరీక్షకు రూ.2,500, పెరాలసిస్, స్కేక్‌బైట్, బ్లడ్‌క్లాట్ పరీక్షలకు రూ.1,000, హెచ్‌బీఏ1సీకి రూ.600, సీకేఎండీ రక్త పరీక్షకు రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. రోగులకు ఈ భారాన్ని తగ్గించేందుకు ప్రస్తుత ప్రభుత్వం అధునాతన యంత్రాన్ని సమకూర్చింది. దీనివల్ల ఆస్పత్రిలోనే ఉచితంగా 640 రకాల పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రోజుకు 200 మందికి రక్త పరీక్షలు



సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ప్రస్తుతం రోజూ 150 నుంచి 200 మంది పరీక్షల కోసం వస్తున్నారు. వీరికి అధునాతన యంత్రం ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి వేగంగా కచ్చితత్వంతో కూడిన ఫలితాలు ఇస్తున్నాం. గతంలో ఇలాంటి టెక్నాలజీతో కూడిన మిషన్లు లేవు. ఒక్క పరీక్ష చేయాలంటే 12 నుంచి 24 గంటల సమయం పట్టేది.

– మహ్మద్‌ఆలీ, సత్తెనపల్లి

అధునాతన యంత్రంతో ఉపయోగం



అధునాతన యంత్రం చాలాబాగా ఉపయోగపడుతోంది. పేదలకు పరీక్షల భారం తప్పింది. ఆస్పత్రి అభివృద్ధికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విశేష కృషి చేశారు.

–కొత్త రామకృష్ణ, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు, సత్తెనపల్లి

640 రకాల పరీక్షలు ఉచితంగా



గతంలో ఆస్పత్రిలో పరీక్ష యంత్రాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆస్పత్రిలోనే అత్యాధునిక యంత్రం ఉంది. 640 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. యంత్రాన్ని సమకూర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– డాక్టర్ బి.లక్ష్మణరావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

ఆరు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆరు మండలాల్లో వర్షపాతం నమోదు కాగా... అత్యధికంగా తాడేపల్లి మండలంలో 28.4 మిల్లీ మీటర్లు వర్షం పడింది. అత్యల్పంగా తుళ్ళూరు మండలంలో 0.4 మి.మీ వాన కురిసింది.

'వర్ల' వాస్తవాలు తెలుసుకోవాలి

టీడీపీ అసత్య ప్రచారాలపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ భూమిని కొని సర్కారుకే అమ్మానని టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్రంగా ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పచ్చ మీడియాలో వచ్చిన అసత్య కథనాలను ఆధారంగా చేసుకొని టీడీపీ నాయకుడు వర్ల రామయ్య తనపై ముఖ్యమంత్రికి లేఖ రాయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. తాను 175 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించానని కోర్టు తీర్పు ఇచ్చినట్లు తనపై వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తాను 200 ఎకరాలు కొనుగోలు చేశానని, అందులో 120 ఎకరాలు జగనన్న కాలనీకి ఇచ్చానని, మిగిలిన 80 ఎకరాల్లో 30 ఎకరాల విస్తీర్ణంలో వల్లభ డెయిరీ ప్రారంభించామని, మిగిలిన 50 ఎకరాల్లో ఆవుల ఫార్మ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తప్పుడు సర్వే నంబరు చూపించి ముల్పూరి ఆగ్రో టెక్ భూములను తనవిగా చూపిస్తూ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

జీవీ అక్రమాలు ఇవిగో..

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అనుచరులు కొప్పుకొండలో 120 ఎకరాలు, శావల్యాపురంలో 47 ఎకరాలు, ఇనిమెళ్లలో శ్మశాన భూమి, కొచ్చర్లలో 50 ఎకరాలు, ఎస్సీలకు ఇచ్చిన ఆర్ఎస్ఆర్ పైబడిన 400 ఎకరాల భూములను ఆక్రమించారని ఆధారాలతో సహా మీడియా ముందు బొల్లా చూపించారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఏకంగా పంట కాలువను ఆక్రమించి గెస్ట్‌హౌస్ నిర్మించారని, నవదీప్ ప్లాంట్ బయోటెక్ పేరుతో 49 ఎకరాల్లో ప్రభుత్వ భూములను కలుపుకున్నారని, తెల్లబాడు గ్రామంలోనూ డక్రా అగ్రిటెక్ పేరుతో భూములు కబ్జా చేశారని బ్రహ్మనాయుడు తెలిపారు. తాను ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే పూర్తిగా భూములను వదులుకుంటానని, ఎవరు వచ్చినా స్వయంగా తన భూములు చూపిస్తానని వెల్లడించారు. నిజాయితీగా కష్టపడి సంపాదించుకున్న ఆస్తులపైనా అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే వాస్తవాలను తెలియజేయాలే తప్ప అవాస్తవ కథనాలు ప్రచురణను తప్పుపట్టారు. ఆధారాలతో నిరూపిస్తూ వార్తలు రాయాలని, ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కోర్టు విచారణ పేరుతో తప్పుడు కథనాలు రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఈనాడు రామోజీ ఎన్ని మోసాలు చేసినప్పటికీ స్పందించకుండా ఎదుటివారిపై బురద చల్లడం పరిపాటిగా మారిందని, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అక్రమాలను కూడా టీడీపీ నాయకులు గుర్తించాలని, వారికి తెలియకపోతే ఆధారాలతో నిరూపిస్తానని అన్నారు. సమావేశంలో ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్ పాల్గొన్నారు.

వెల్‌ట్రైన్డ్

ఎన్డీఆర్ఎఫ్, రైల్వేశాఖ జాయింట్ మాక్ ఎక్సర్‌సైజ్



కృత్రిమ'మంట' : రైలు బోగీ నుంచి పొగలు



పర్యవేక్షణ : మాక్ ఎక్సర్ సైజ్‌ను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు



ఆపద్రక్ష : ప్రయాణికుల రక్షణపై ప్రయోగాత్మక ప్రదర్శన



'నీరు'పమాన ప్రదర్శన : నీటితో మంటలను ఆర్పుతున్న దృశ్యం

రైలు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులను ఎలా కాపాడాలి? ప్రాణనష్టాన్ని ఎలా నివారించాలి? బోగీల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలి? మంటలను ఎలా నివారించాలి? బాంబు డిస్పోజల్, ప్రాథమిక వైద్యం, సమాచార కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై గుంటూరు రూరల్ మండలం నల్లపాడు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ట్రైన్డ్ ఎన్డీఆర్ఎఫ్, రైల్వే శాఖ సిబ్బందితో విన్యాసాలు ప్రదర్శించారు. ఎస్‌సీఆర్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకటరమణారెడ్డి, ఏపీ విపత్తుల ప్రతిస్పందన అగ్నిమాపక సేవా విభాగానికి చెందిన అధికారి కె.కృష్ణారెడ్డి, సీఆర్ఎస్ఈ ఆర్.సుందరరాజన్, మెడికల్ డైరెక్టర్ సురేంద్రనాయక్, గుంటూరు డీఎస్‌వో బి.విజయకీర్తి, ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జాఫిరుల్ ఇస్లాం సీనియర్ అధికారులతో కలిసి ఎక్సర్‌సైజ్‌ను వీక్షించారు. రైల్వే బోర్డు న్యూఢిల్లీ హెడ్ క్వార్టర్స్, సౌత్ సెంట్రల్ రైల్వే ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో 10వ బెటాలియన్, విజయవాడ రైల్వే బ్రేక్‌డౌన్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చురుగ్గా పాల్గొన్నాయి. కార్యక్రమాన్ని డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం ఆర్.శ్రీనివాస్ ఇతర రైల్వే అధికారులు పర్యవేక్షించారు.

–గుంటూరు రూరల్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: వ్యవసాయంతోపాటు పరిశ్రమల స్థాపనకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్నందిస్తుందని దీనిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్‌లో అనేక అవకాశాలున్నాయన్నారు. దీనికి ప్రభుత్వం రాయితీలను కూడా అందిస్తుందన్నారు. పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి మార్గాలు సుగమమవుతాయని చెప్పారు. దరఖాస్తులను ఆయా శాఖలు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సింగిల్ డెస్క్‌లో ఉన్న దరఖాస్తులు ఆయా శాఖాధికారులు సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి 59 క్లెయిమ్స్‌కుగాను 7,18,83,225 మంజూరు చేస్తూ కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం విజయ రత్నం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.గోపీకృష్ణ, ఎల్‌డీఎం రత్న మహీపాల్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తరగతి గదుల్లోనే చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు

చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాదులు తరగతి గదుల్లోనే పడుతుంది, వారు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లకుండా ఉన్న చిన్నారులను గుర్తించి తక్షణం తరగతి గదులకు పంపాలన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు డ్రాపవుట్స్ అయిన చిన్నారుల తల్లిదండ్రులతో వెళ్లి మాట్లాడాలన్నారు. జిల్లాలో 5 నుంచి 18 ఏళ్ల వయస్సున్న పిల్లల గ్రాస్ ఎన్రోల్‌మెంట్ నూరు శాతం పూర్తయ్యేలా అధికారులు చూసుకోవాలన్నారు. ప్రతి రోజూ పురోగతిపై నివేదిక అందించాలని చెప్పారు. గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణత కాని విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రక్త హీనత, అనారోగ్య సమస్యలు ఉన్న చిన్నారులకు ఎప్పటికప్పుడు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. అవసరం మేరకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఈఓ శైలజ, హౌసింగ్ పిడి వేణుగోపాల్‌రావు, జడ్పీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లోని స్థలాలకు హక్కు పత్రాలు

- స్వమిత్వ పథకం ద్వారా అందించేలా చర్యలు
- హక్కు పత్రాలు లేని స్థలాలకు యాజమాన్య హక్కులు



స్వమిత్వ సర్వేలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు

చిలకలూరిపేట: గ్రామాల్లో తరతరాలుగా హక్కు పత్రాలు లేని స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ పత్రాలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. స్వమిత్వ పథకం ద్వారా గ్రామాల్లోని స్థలాలను రీ సర్వే చేసి హద్దులు నమోదు చేసి హక్కు పత్రాలను అందించనున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలోని పలు గ్రామాల్లో కొనసాగుతోంది. గ్రామాల్లోని ప్రజలకు కూడా విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగిన నేపథ్యంలో ఆర్థికంగా పురోగతిని సాధిస్తున్నారు. దీంతో గ్రామాల్లో కూడా ఖరీదైన భవనాలు నిర్మితమౌతున్నాయి. అయితే పూర్వం నుంచి గ్రామాల్లో నివేశన స్థలాలకు చట్టప్రకారం నిర్దిష్టమైన డాక్యుమెంట్లు ఉండేవి కావు. ఇంటి స్థలానికి సంబంధించిన యాజమాన్య హక్కు పత్రాలు తరతరాలుగా లేకపోవడంతో ఆర్థిక అవసరాల కోసం తమ ఇంటిని తాకట్టుపెట్టి రుణం పొందటానికి అవకాశం ఉండేదికాదు. దీంతో గ్రామాల్లోని ప్రజలు పట్టణాలు, నగరాల్లో లాగా తమ ఇళ్లు ఆర్థిక అవసరాలకు ఉపయోగపడటం లేదనే ఆందోళన నెలకొని ఉండేది. అలాగే గ్రామ కంఠాల్లో ఉన్న ఇళ్లు, పశువుల కొష్టాలు తదితర వాటికి గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి హక్కు పత్రాలు ఉండేవి కాదు. ఈ సునిశితమైన అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టాయి. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) పథకాన్ని అమలు చేస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలకు సంబంధించిన నివాసాలకు యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. దీని వల్ల తమ బిడ్డల పెళ్లిళ్ల కోసమో, చదువుల కోసమో, ఇతరత్రా ఆర్థిక అవసరాల కోసమో బ్యాంకుల్లో ఈ పత్రాలను తనఖా పెట్టి రుణం పొందే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

జిల్లాలో కొనసాగుతున్న సర్వే....

జిల్లాలో 526 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 133 పంచాయతీల్లో స్వమిత్వ పథకం రీసర్వే పనులు కొనసాగుతున్నాయి. ఈ పథకంలో డ్రోన్ సర్వే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గ్రామాల్లోనూ ఇళ్లను సర్వే చేసి ప్రజలకు రికార్డ్ ఆఫ్ రైట్స్ కార్డులు మంజూరు చేస్తారు.తద్వారా గ్రామీణ ప్రాంతాల ఆస్తి హక్కులపై స్పష్టత ఇస్తారు. అలాగే పన్ను వసూళ్ల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయ వనరులను సమకూర్చుకోవడానికి అవకాశం కలుగుతుంది.

వివరాల నమోదు ఇలా...

స్వమిత్వ పథకం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో స్థలం, లేదా ఆస్తి ఫొటోలు తీస్తారు. ఇళ్లు, ఇంటి చుట్టుపక్కలా ఖాళీ స్థలం కొలతలు తీసుకుంటారు. ఇంటి యజమాని పేరు, వివరాలు సేకరిస్తారు. ఇరుగుపొరుగు వారి పేర్లతో హద్దులు నమోదు చేస్తారు. రోడ్డు ఉంటే ఆ వివరాలు పొందుపరుస్తారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అన్ని వివరాలను పక్కాగా నమోదు చేసుకుంటారు. సేకరించిన వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. అన్ని వివరాలు సేకరించాక అభ్యంతరాలు ఉంటే తెలపాలని 92 నోటీసులు జారీ చేస్తారు. గ్రామ సభ నిర్వహించి అభ్యంతరాలు ఉంటే సేకరిస్తారు. ఆ తదుపరి రికార్డ్ ఆఫ్ రైట్స్ కార్డులు మంజూరు చేస్తారు.

ఉపయోగాలు ఇలా...

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం వలన ఆస్తికి సంబంధించి డాక్యుమెంట్లు ఏవి అవసరం ఉన్నా ఆన్‌లైన్ ద్వారా తీసుకొనే వెసలుబాటు కలుగుతుంది. ఇంటి విలువ ఆధారంగా బ్యాంకు రుణం పొందడానికి వీలౌతుంది. ఏ అవసరం ఉన్నా మీ–సేవా ద్వారా ఇంటికి, ప్లాటుకు సంబంధించిన వివరాలన్నీ పొందవచ్చు. ఇంటింటి సర్వేలో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు పాల్గొంటారు. వివరాల సేకరణ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇప్పటికే జిల్లాలోని మద్రిపాలెం, పెద అగ్రహారం, చిన అగ్రహారం, పీసపాడు, రుక్మిణీపురం, చెన్నయ్యపాలెం గ్రామ పంచాయతీల్లో సర్వే పూర్తికాగా, మిగిలిన గ్రామాల్లో సర్వే పనులు కొనసాగుతున్నాయి.

సర్వే జరుగుతోంది...

స్వమిత్వ సర్వే జిల్లాలోని 526 పంచాయతీలకుగాను 133 పంచాయతీల్లో జరుగుతోంది. జిల్లాలో తొలిగా మద్రిపాలెం పంచాయతీలో 285 మందికి ప్రాపర్టీ కార్డులు అందజేశాం. మరో ఐదు పంచాయతీల్లో పంపిణీ చేసేందుకు కార్డులు సిద్ధం చేశాం. దశలవారీగా అన్ని పంచాయతీల్లో రీసర్వే పనులు పూర్తి చేసి ప్రాపర్టీ కార్డులు అందజేస్తాం.

–ఎంవీ భాస్కరరెడ్డి,
జిల్లా పంచాయతీ అధికారి

ఆరోగ్యశ్రీ పథకం అన్ని రాష్ట్రాలకు ఆదర్శం

- బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీ కృష్ణ
- మామిళ్లపల్లిలో గుండెవ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన
- జగన్నామ సంక్షేమ కార్యక్రమంలో గుండె సర్జరీలు చేయించుకున్న కుటుంబాలకు పరామర్శ



హరమ్మను పరామర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్న ఆరోగ్యశ్రీ పథకం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీ కృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో ఇటీవల గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వారిలో వ్యాధి నిర్ధారణ అయిన ఏడుగురికి స్టెంట్‌లు, ముగ్గురికి బైపాస్ సర్జరీ నిమిత్తం పదిమందిని ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి పంపి, పది మందికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందించారు. శుక్రవారం మామిళ్లపల్లి గ్రామంలో వైద్య సేవలు పొందిన పది మందిని బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఇంటింటికీ వెళ్లి వారికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా జరిగిన లబ్ధిని గురించి ప్రత్యేకంగా వివరించారు. ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ఆరోగ్యశ్రీ పథకంలో ప్రతి ఇంట ఆరోగ్యం – ప్రతీ కంట ఆనందం వెల్లివిరుస్తున్నాయన్నారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా మీ గుండె పదిలం నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ఆరోగ్యశ్రీతో అనుసంధానం చేస్తూ బాధితుల ప్రాణాలు నిలపడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు.

ఈసందర్భంగా ఇంటింటికీ ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసుకువచ్చి తమకు ఏ మాత్రం అవగాహన లేకపోయినా అన్నీ తానే నడిపిస్తూ నిండు ప్రాణాలు నిలబెడుతున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ సేవలను మామిళ్లపల్లి గ్రామస్తులు అభినందించారు.

యువకులను కాపాడిన ఘనత గజ ఈతగాళ్లదే

సన్మానించిన డీఎస్పీ టి.వెంకటేశులు



పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను సన్మానిస్తున్న బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు

బాపట్లటౌన్: ప్రాణాలకు తెగించి సముద్రంలో గల్లంతైన యువకులను కాపాడుతున్న ఘనత గజ ఈతగాళ్లకే దక్కుతుందని డీఎస్పీ టి.వెంకటేశులు అన్నారు. ఈనెల 23న సముద్రంలో గల్లంతైన ఇద్దరు యువకులను కాపాడిన గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బందిని శుక్రవారం సూర్యలంక సముద్రతీరంలో డీఎస్పీ సత్కరించి, నగదు బహుమతులు అందజేశారు. డీఎస్పీ టి. వెంకటేశులు మాట్లాడుతూ సూర్యలంక సముద్రతీరంలో స్నానం చేస్తూ అలల ధాటికి సముద్రంలోకి కొట్టుకుపోతున్న మంగళగిరికి చెందిన ఫణితపు దేవప్రకాష్ అలియాస్ షన్ను, అందె ప్రశాంత్‌లను గమనించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, కానిస్టేబుల్ పి.వెంకటరావు, సూర్యలంక మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే హోంగార్డు కె.వెంకటనారాయణ, గజఈతగాళ్లు కొక్కిలిగడ్డ సుబ్బారావు, కొక్కిలిగడ్డ సత్యనారాయణ, మోకా గోపీకృష్ణలు కాపాడారన్నారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ సూచనలతో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చు సూర్యలంక సముద్రతీరం వెంబడి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. యాత్రికుల రక్షణ కోసం సముద్ర తీరం వెంబడి గజ ఈతగాళ్లను నియమించామన్నారు. ఎప్పటికప్పుడు యాత్రికులను అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా పోలీస్ సిబ్బంది హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తున్నారన్నారు. కొంతమంది యువకులు పోలీస్ సూచనలను, హెచ్చరికలను పెడచెవిన పెట్టి సముద్రంలోపలకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఆహ్లాదకరంగా గడపడానికి సముద్రతీరాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ప్రమాదాలు, సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా వారి పర్యటనను ముగించుకొని సంతోషంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతోనే పోలీస్ సిబ్బంది పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తుంటారన్నారు. యాత్రికులు పోలీస్ వారి సూచనలను తప్పనిసరి పాటించాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మద్యం సేవించి సముద్రంలో దిగిన, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, పోలీస్ వారి సూచనలు పెడచెవిన పెట్టిన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి, పట్టణ సీఐ పి.కృష్ణయ్య, బాపట్ల పట్టణ, రూరల్, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా బీసీల కులగణన చేపట్టాలి

- వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్
- ఘనంగా బీపీ మండల్ జయంతి




బీపీ మండల్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

గుంటూరు రూరల్: బీసీల కుల గణన దేశవ్యాప్తంగా చేపట్టినపుడే వెనుకబడ్డ తరగతులకు సరైన సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. బీపీ మండల్ మహాసేన నాయకుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు నేతృత్వంలో అమరావతి రోడ్డులోని చిల్లీస్ సెంటర్ వద్ద బీపీ మండల్ 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డొక్కా మాట్లాడుతూ 52 శాతం ఉన్న బీసీలకు సామాజికంగా రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ప్రమోషన్స్‌లో కూడా ఈ రిజర్వేషన్‌ను అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విగ్రహ కమిటీ కో కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీహార్ ముఖ్యమంత్రిగా నాటి మండల కమిషన్‌కు చైర్మన్‌గా ఎన్నో ఉన్నత పదవులను అలంకరించిన బీసీల నేత బీపీ మండల్ అని కొనియాడారు. మండల కమిషన్ నాడు బీసీల అభ్యున్నతికి 40 సిఫార్సులు చేస్తే నాటినుంచి నేటి వరకూ సిఫార్సులను అమలు చేయలేదన్నారు.

కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ దానబోయిన శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం యువజన నాయకుడు కుమ్మరి క్రాంతికుమార్, డాక్టర్ ఎన్ శేషయ్య, కేశవ, దాసరి శివకుమార్, వేములపల్లి శ్రీనివాస్, పీవీ కృష్ణయ్య, తోట శ్రీనివాసరావు, డాక్టర్ కె.నరశింహారావు, తదితరులు పాల్గొని బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సాగర్ ప్రాజెక్టులో రూ.90 కోట్ల వ్యయంతో పనులు

తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరి రజత్‌కుమార్



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఓ అండ్ ఎం నిర్వహణ పర్యవేక్షణ విభాగాన్ని నూతనంగా ఏర్పాటు చేసి, రూ. 90 కోట్ల వ్యయంతో నిర్వహణ పర్యవేక్షణ పనులను పూర్తి చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ అన్నారు. సాగర్ సందర్శనలో భాగంగా శుక్రవారం ప్రాజెక్టులో 20 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న స్పిల్‌వే మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుడి కాలువకు సంబంధించి 8 రెగ్యులేటర్ గేట్లు, ఎడమ కాలువకు సంబంధించి మూడు గేట్లు, ప్రధాన డ్యాంకు సంబంధించి 2 సూట్ గేట్లు, డ్రైనేజీ హోల్స్, ఫోరస్ హోల్స్‌తో పాటు మరి కొన్ని అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. ఆయన వెంట నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, ఎస్ఈ నాగేశ్వరావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈ పరమేష్ తదితరులు ఉన్నారు.

నాగార్జున కొండ సందర్శన

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను రజత్‌కుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ముందుగా లాంచీలో కొండకు చేరుకొని అక్కడి మ్యూజియం, సింహళ విహార్, మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, పున ర్నిర్మిత కట్టడాలను తిలకించారు. నాగార్జున కొండ చారిత్రక వివరాలను టూరిజం గైడ్ సత్యనారాయణ వివరించారు.

రేపు సత్తెనపల్లిలో ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఆదివారం సత్తెనపల్లిలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్స్ (బాల, బాలికలు), సీనియర్స్ (మెన్ అండ్ ఉమెన్) కు సంబంధించిన పల్నాడు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్ కం సెలక్షన్స్ ట్రైల్స్ జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జోసఫ్ పీటర్, సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లీగ్ ఛాంపియన్స్‌లో సెలెక్ట్ అయిన జట్లు పల్నాడు జిల్లా జూనియర్స్ (బాల,బాలికలు), సీనియర్స్ (మెన్ అండ్ ఉమెన్) ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జరిపే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. పల్నాడు జిల్లాలో జూనియర్స్ విభాగంలో బాలురు 2008–09, బాలికలు 2007–09 మధ్య పుట్టిన వారు అర్హులన్నారు. డేట్ ఆఫ్ బర్త్, ఆధార్ జిరాక్స్, రెండు ఫొటోస్ తీసుకొని ఈనెల 27న ఉదయం 8 గంటలకు సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 97010 52588 కాల్ చేసి తెలుసుకోవాలన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

నరసరావుపే టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా అనే అంశంపై విద్యార్థులకు ప్రాంతీయ భాషలో పోటీలు నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆగస్టు ఒకటి నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి, 18 సంవత్సరాల వయస్సు లోపు ఉన్నవారికి రెండు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు గెలుపొందిన వారికి అందజేస్తామన్నారు. దీన్ దయాల్ స్పర్శ్ యోజన పేరుతో నూతన పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. బిళ్లల సేకరణలో విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు ఉపకార వేతన పథకం ప్రవేశపెట్టటం జరిగిందన్నారు. ఈ పథకంలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పిలాటెలి క్విజ్, పిలాటెలి ప్రాజెక్ట్‌లో పోటీలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు రూ.6 వేలు వార్షిక ఉపకార వేతనం ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు తపాల శాఖ డివిజనల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

మిలిటరీ తుపాకీ పోలీసులకు అప్పగింత



పోలీసులకు తుపాకీని అందిస్తున్న కుటుంబ సభ్యులు

స్వర్ణ (కారంచేడు): అతనో మిలిటరీ జవాను.. రిటైర్ అయ్యాడు. అనంతరం రెండేళ్ల తర్వాత ఓ ప్రమాదంలో మృతి చెందాడు. ప్రస్తుతం తన వద్ద ఉన్న తుపాకీని తన భార్య, కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌లకు అప్పగించారు. అందిన వివరాల మేరకు.. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన సాదు రంగారావు (50) మిలిటరీలో పనిచేస్తూ రిటైర్ అయ్యాడు. అప్పట్లో తను ఒక లైసెన్స్‌డ్ గన్ కొనుగోలు చేశాడు. 2021 ఆగస్టు 2వ తేదీన ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు సంబంధించిన లైసెన్స్‌డ్ తుపాకీని రంగారావు భార్య, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి అప్పగించేందుకు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు స్వర్ణ వచ్చి తుపాకీని, 12 రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

తెలుగుభాషా దినోత్సవ పోటీల విజేతలు వీరే

నేడు గుంటూరులో బహుమతి ప్రదానం

గుంటూరుఎడ్యుకేషన్: తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు శనివారం సాయంత్రం 4.00 గంటలకు గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని డీఈఓ పి.శైలజ శుక్రవారం తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులతోపాటు తెలుగు ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొని తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. వ్యాసరచనలో బి.చిత్రలేఖ(జెడ్పీ హైస్కూల్, నారాకోడూరు),, వి.త్రివేణి (జెడ్పీ హైస్కూల్, లాలుపురం), వక్తృత్వంలో పి.సిరి (జెడ్పీ హైస్కూల్, పెదకాకాని), బి.నిహారిక (నిర్మలా హైస్కూల్, మంగళగిరి) ప్రథమ, ద్వితీయ బహుమతులను పొందారు.